## బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, మే 17 : నిరుపేద ఎస్సీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా ఉచిత విద్య అందించడానికి ఆసక్తిగల ఇంగ్లిష్ మీడియం పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బీ విక్రమ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి (డే స్కాలర్), 5వ తరగతి(రెసిడెన్షియల్) విధానంలో విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశం కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలలు మంచి మౌలిక వసతులు కలిగి ఉండడంతో పాటు ఐదేళ్లలో 7వ తరగతి, 10వ తరగతితో 90 శాతంకి పైగా ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. అలాగే, 50 శాతంపైగా విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల పాఠశాల నిర్వాహకులు 19 నుంచి 31లోపు కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## జనహిత మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి విక్రమ్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ చౌరస్తా, మే 17 : జనహిత కౌండిన్య మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీ విక్రమ్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కుర్మవాడ ఏరియాలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ ప్రతిమ ఆదేశాల మేరకు జనహిత కౌండిన్య మధ్యవర్తిత్వ కేంద్రాన్ని జడ్జి విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ, ఆస్తి, ఇతర తగాదాల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లు, కోర్టులకు వెళ్లకుండా మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ప్రజలు ఉచితంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇక్కడికి వచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంటాయని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రంలో విధులు నిర్వర్తించే ప్రతినిధులు మూడు రోజుల పాటు హైకోర్టు ఆధ్వర్యంలో శిక్షణ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ పీ దామోదర్ రెడ్డి, మధ్యవర్తి మేకపోతుల ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

స్టేషన్ ఘన్‌పూర్, మే 17 : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో చదివి, ఉపాధి లేని వారు ఇన్ఫోసిస్ సౌజన్యంతో నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కే కృతమూర్తి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. 19 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులకు రాష్ట్ర సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఘన్‌పూర్‌లోని కళాశాలలో మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పాఠశాలలో వేదిక నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట, మే 17: బచ్చన్నపేట ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చెన్నమాధవుని హరిచరణ్‌రాజు చేస్తున్న కృషి అభినందనీయమని హెచ్‌ఎం వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో సభావేదిక నిర్మాణానికి ఉపాధ్యాయులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హరిచరణ్‌రాజు తండ్రి రాఘవరాజు కూడా హెచ్‌ఎంగా పనిచేశారని, ఆయన స్మారకార్థం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణంతో పాటు తాగునీటి కోసం బోరు, మోటరు అందించారన్నారు. అంతే కాకుండా కంప్యూటర్లు కూడా అందజేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల కోసం చేయూతనివ్వడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లత, ఉపాధ్యాయులు దమ్ము నర్సింహారెడ్డి, లక్ష్మీనర్సమ్మ, కృష్ణమోహన్, మల్లారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, రజిత, రిటైర్డు ఉపాద్యాయుడు రామచంద్రం, వేదిక నిర్మాణ ప్రతినిధి యాదగిరి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTek
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

HOUSE FOR SALE

★South East H.No. 35-1-43, 190 Sq.yds. Near Gopalpur Krishnaveni Talent School. Contact Cell: 9908865582.
NTW-000

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

BUSINESS OFFER
★Wanted Investor for Gents Hair Cutting Saloon Business at Hyderabad. Good Returns. Contact: 7075526841, 7075519740.
NT-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565



సిద్దెంకిలోని క్రీడా ప్రాంగణంలో కట్టేసిన పశువులు


ఎల్లంలలో చెత్త చెదారంతో అధ్వానంగా ఉన్న క్రీడా ప్రాంగణం

# క్రీడా ప్రాంగణాలపై సర్కారు నిర్లక్ష్యం

- అభివృద్ధి పనులు, వసతులపై తాత్సారం
- గ్రామీణ యువతకు అందని స్పోర్ట్స్ కిట్స్
- అధికారుల పర్యవేక్షణ లోపంపై సర్వత్రా విమర్శలు

జనగామ రూరల్, మే 17 : క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు స్పోర్ట్స్‌పై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు పట్టనట్లు వ్యవహరిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. క్రీడారులకు వసతులు కల్పించకపోవడంతో చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల ముందు సరఫరా చేసిన క్రీడా సామగ్రి గ్రామ పంచాయతీ కార్యాలయాలకే పరిమితమైంది. మరికొన్ని చోట్లు స్పోర్ట్స్ కిట్ మాయమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని 12 మండలాల్లో 281 గ్రామ పంచాయతీలున్నాయి. 202 ఆవాస గ్రామాలు ఉన్నాయి. మొత్తంగా అన్ని గ్రామాల్లో 483 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు సుమారు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్‌లో శిక్షణతోపాటు తదితర ఆటలు ఆడేందుకు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు వెచ్చించి స్పోర్ట్స్ కిట్లను కొనుగోలు చేశారు. అయినా వీటిని యువతకు అందించలేదు. దీంతో ఈ వేసవిలో క్రీడల్లో శిక్షణ పొందాలనుకునే వారికి నిరాశే ఎదురవుతున్నది.

**గ్రామాల్లో అస్తవ్యస్తంగా క్రీడా ప్రాంగణాలు...**

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు అవి వినియోగంలో లేవు. పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. క్రీడా పరికరాలను దొంగలు చోరీ చేయగా, మరికొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. పలు చోట్ల పశువులను క్రీడా ప్రాంగణంలోని చెట్లకు కట్టేస్తున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి, వాటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పాము కాటుతో వృద్ధురాలి మృతి


వేముల లక్ష్మి(ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మే 17 : మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన వేముల లక్ష్మి(65) శనివారం పాము కాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె శుక్రవారం రాత్రి వర్షం పడగా, శనివారం ఉదయం ఇంటిలోని తులసి గద్దె వద్ద ఉన్న గడ్డిని తీస్తుండగా పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లక్ష్మికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## యువతిని మోసం చేసిన కేసులో ఒకరి అరెస్టు

తరిగొప్పుల, మే 17 : ఓ యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన తరిగొప్పులకు చెందిన కోనేటి మణికంఠపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించినట్లు ఎస్సై శ్రీదేవి తెలిపారు. మణికంఠ ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పడమే కాకుండా గర్భవతిని చేసి, మరో అమ్మాయితో పెళ్లి కుదుర్చుకోగా బాధిత యువతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై వెల్లడించారు.


ఘటనా స్థలంలో లేగదూడ కళేబరంతో బాధితుడు

## విద్యుదాఘాతంతో లేగ దూడ మృతి

నర్మెట, మే 17: విద్యుదాఘాతంతో లేగదూడ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెటకు చెందిన కూకట్ల చిన్నమల్లయ్యకు చెందిన లేగదూడ 24కేవీ ట్రాన్స్‌పార్మర్ వద్ద విద్యుత్ షాక్‌గురై అక్కడిక్కడే మృతిచెందింది. ట్రాన్స్‌పార్మర్‌కు ఎలాంటి కంచె లేకపోవడం వలనే ఈ ఘటన చోటుచేసుకుందని స్థానిక రైతులు తెలిపారు. బాధిత రైతుకు ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.

## రేపు పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన ఇసుక వేలం

దేవరుప్పుల, మే 17 : కొంతకాలంగా అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలించిన ఇసుకను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచి, దానికి ఈ నెల 19న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఆండాళు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

దేవరుప్పుల, మే 17 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను పట్టించుకోకుడా నిర్లక్ష్యం చేస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో మీనమేషాలు లెక్కిస్తూ కాలం వెల్లదీస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణాతరగతుల కరపత్రాలను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒకటి రెండు అమలు చేసి, అన్ని చేసినట్టు సీఎంతో పాటు మంత్రులు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా నేత దాసగోని సుమ, ఐలాపురం నర్సమ్మ,రెడ్డిరాజుల నారాయణ, కొప్పుల ఉప్పలయ్య, పయ్యాల భిక్షపతి, చింత మైసయ్య పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మే 17 : రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి 12 మండలాల ఎంపీడీవోలతో కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, బీసీ సంక్షేమశాఖ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

**సబ్సీడీపై జీలుగు విత్తనాలు**

జిల్లాలోని రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. జిల్లాలో 5 వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలకు అలాట్‌మెంట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.4,275 ఉండగా, 50శాతం సబ్సిడీ పోను రైతులు రూ.2137.5 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ఒక బస్తా 2.20 ఎకరాల వరకు వస్తుందని సూచించారు. విత్తానాలు కావాల్సిన రైతులు వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో సంబంధిత ఏఈవోల దగ్గర పర్మిట్ పొంది ఆగ్రో సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల వద్ద విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

## నకిలీ విత్తనాలను ప్రభుత్వం అరికట్టాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందు

జనగామ చౌరస్తా, మే 17 : నకిలీ విత్తనాలను అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాదారులతో పాటు ప్రైవేట్ గ్రోమోర్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని ఇటీవల ఫిర్యాదు చేసినా వ్యవసాయశాఖ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయడం లేదన్నారు. బయో సీడ్ పేరుతో అనుమతి ఏలని పత్తి, వరి, మక్కజొన్న విత్తనాలు జిల్లాలోని రైతులకు దళారుల ద్వారా విక్రయిస్తున్నారని ఆరోపించారు. వానాకాలం రైతు భరోసా నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రైతులకు రైతు బీమా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, మంగ బీరయ్య, మాచర్ల సారయ్య, మీట్యా నాయక్, రవీందర్‌రెడ్డి, రాజవ్వ, కుమారస్వామి, కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గపోరు

- తరిగొప్పుల మండలంలో పోటాపోటీగా సమావేశాలు
- నేతల తీరుపై అధిష్ఠానం గుర్రు

తరిగొప్పుల, మే 17 : జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని కాంగ్రెస్ నాయకుల్లో వర్గపోరు ముదురుతున్నది. ఓ వైపు పార్టీ మండల అధ్యక్షుడికి భిన్నంగా మరికొందరు నాయకులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ గ్రూపుల పోరు కొనసాగిస్తున్నారని చర్చ జరుగుతున్నది. ఆ పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండానే పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నారని కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను ఏకం చేస్తున్నారు. అధిష్టానం ఆదేశాలకు భిన్నంగా మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమకు అనుకూలమైన వారికి మద్దతు తెలుపుతూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు. తాజాగా మరోమారు పార్టీ మండల అధ్యక్షుడిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ శనివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. దీంతో రోజురోజుకు మండలంలోని కాంగ్రెస్‌లో గ్రూపుల పోరు కొనసాగుతున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ నేతలు కల్పించుకుని రెండు వర్గాల మధ్య సమన్వయం కుదుర్చాల్సిన అవసరం ఉందని నాయకులు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నేతలు చిలువేరు సంపత్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, తరిగొప్పుల గ్రామ అధ్యక్షుడు పండుగ కనకయ్య మాట్లాడుతూ అధిష్టానం జోక్యం చేసుకుని పార్టీని సమన్వయం చేయాలని కోరారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన


లింగపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చిల్పూరు, మే 17 : మండలంలోని లింగంపల్లిలో సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను నివరించడానికి సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ, లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జేఎల్ఎం రాజిరెడ్డి, రవి, సిందయ్య, నాయకులు శ్రీనివాస్, రాజన్న, బుచ్చిరాజు, రాజు, వీరన్న, చంద్రమౌళి, యాదగిరి, ఏళ్లెంద్రం, సుధాకర్ పాల్గొన్నారు.

## • హాయిగా.. చల్లగా..


యశ్వంతాపూర్‌లో స్విమ్మింగ్ చేస్తున్న పిల్లలు

ఎండలు విపరీతంగా కొడుతుండడంతో చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు చల్లదనం కోసం తల్లడిల్లుతున్నారు. వేసవి నుంచి కొంత మేర ఉపశమనం కోసం మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని స్విమ్మింగ్‌పూల్‌లో పిల్లలు ఈతకొడుతు సేద తీరుతున్నారు. ఇష్టంగా ఈతనేర్చుకోవడంతో పాటు చల్లదనం కోసం వచ్చి హాయిగా సేదతీరుతున్నారు.

– జనగామ రూరల్

## కేజీబీవీలో దరఖాస్తులకు ఆహ్వానం

రఘునాథపల్లి, మే 17 : మండలంలోని ఖిలాషాపురం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ జీ హేమలత తెలిపారు. ఈ విద్య సంవత్సరం ఇంటర్మీడియట్ వరకు పొడగించి, ఎంఎల్‌టీ కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. అందులో 40సీట్లు ఉన్నాయని పదో తరగతి ఉతీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అలాగే, ఆరో తరగతిలో 40సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9666930586 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


రాములమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## రాములమ్మకు ఎమ్మెల్యే పల్లా నివాళి

జనగామ రూరల్, మే17 : మండలంలోని వడ్లకొండ శివారులోని సుందరయ్య నగర్‌కు చెందిన రెడ్డబోయిన రాములమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ మేకల కలింగరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, గ్రామ అధ్యక్షుడు నామమాల భాస్కర్, కాయితపురం రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

## 'క్యాంపు కార్యాలయాన్ని కంపు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు'

కొడకండ్ల, మే 17 : నియోజకవర్గ కేంద్రంలో స్థానిక శాసనసభ్యుల పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో నిర్మించిన పాలకుర్తి క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే లేకున్నా కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంగా వినియోగించుకుంటూ కంపు చేస్తున్నారని జీసీసీ మాజీ చైర్మన్ అభిమాన్ గాంధీనాయక్ విమర్శించారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పార్టీ తరపు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఓ ప్రకటనలో గాంధీనాయక్ వారిపై విరుచుకుపడ్డారు. ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని పార్టీ కార్యాలయంగా వాడుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కంపు రాజకీయాన్ని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసి, రాజ్యాంగాన్ని అవమాన పరిచారని ధ్వజమెత్తారు. ప్రెస్‌మీట్ పెట్టేందుకు అవకాశం ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రెస్‌మీట్ పెట్టిన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## క్రైం ఏసీపీగా కిరణ్‌కుమార్




సుబేదారి, మే 17 : వరంగల్ పోలీసు కమిషనరేట్ క్రైం ఏసీపీగా నియామకమైన కిరణ్‌కుమార్ వరంగల్ సీసీఎస్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏసీపీని క్రైం విభాగ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రశాంతంగా కేయూ ఎంబీఏ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, మే 17 : కాకతీయ విశ్వవిద్యాలయ ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. శనివారం జరిగిన పరీక్షలకు మొత్తం 2,100 మందికి 1950మంది విద్యార్థులు పరీక్ష (93 శాతం) రాసినట్లు పేర్కొన్నారు. క్యాంపస్‌లోని కామర్స్ కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అమరావేణి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఆసిం ఇక్బాల్, ప్రగతి తదితరులు ఉన్నారు.

**దూరవిద్యా బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ పరీక్ష కేంద్రం సందర్శన..**

కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్యా కేంద్రంలో జరుగుతున్న బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ పరీక్షల తీరుతెన్నులను రిజిస్ట్రార్ రామచంద్రం పరిశీలించారు. ఆయన వెంట పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, దూరవిద్యా కేంద్ర సంచాలకులు సురేశ్‌లాల్, వెంకయ్య, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ, సీతారాం ఉన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా వెంకన్న వార కల్యాణం

చిల్పూరు, మే 17 : మండల కేంద్రంలోని శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు నార్లగిరి సమ్మయ్య-అహల్య, ప్రశాంత్- ప్రత్యూష అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, దేవస్థానం చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు, డైరెక్టర్లు గనగోని రమేశ్‌గౌడ్, వేముల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి భిక్షపతి, మాజీ డైరెక్టర్ సంగోజు శంకరలక్ష్మీ-మోహన్‌చారి దంపతులు, ప్రధాన అర్చకులు బ్రహ్మనపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది కుర్రెంల మోహన్, వీరన్న, మహేశ్, విశాల్, అజయ్, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

## వధూవరులకు బీఆర్ఎస్ నాయకుల ఆశీర్వాదం

దేవరుప్పుల, మే 17 : మండలంలోని నీర్మాలకు చెదిన బీఆర్ఎస్ కార్యకర్త మేడ భిక్షపతి-సుశీల దంపతుల కూతురు నందిని వివాహం గ్రామంలో శనివారం జరుగగా బీఆర్ఎస్ మండల నాయకుడు పల్లా సుందరరాంరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి, కానుకలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మేడ విద్యాసాగర్, నాయకులు కాడబోయిన యాదగిరి, మేడ మారయ్య, మేడ మహేందర్, మేద చిరంజీవి, మేడ రాంచందర్, పల్లేర్ల నవీన్, భిక్షపతి పాల్గొన్నారు.

## ఆదివాసీలపై దాడులు ఆపాలి

దేవరుప్పుల, మే 17: ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపి వారితో చర్చలు జరపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న అన్నారు. కడవెండి దొడ్డికొంరయ్య భవన్‌లో శనివారం సీపీఐ 4వ మండల మహాసభ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఆదిసాయన్నతో పాటు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్ హాజరై మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలు, ఇతరులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అంతకుముందు సీనియర్ నాయకుడు ఎడ్ల నారాయణ పార్టీ జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సోమయ్య, రైతు నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, బెజగం ఎల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గనుపాక ఆగయ్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సుజిత్, ప్రశాంత్ పాల్గొన్నారు.